# డిటెక్టివులు ★

రచన:
ముక్తేవి వీరరాఘవరావు

"ఏరా! ఈపూటగూడా ఫ్రెంచి లీవా" అన్నారు నా మిత్రులు.

"మీకు మతిపోతోందా. ఈ పూట లెక్చరరు రాడురా" అన్నాను.

"అట్లాగా" ఎగిరి గంతేశారు.

నేను మామూలుగా ఒక పుస్తకం తీసి పైన 'విజయ' అనేపేరు వ్రాశాను.

"ఇంతలో మా మిత్రుడు వీరోయ్ పేరు ఎప్పుడు మార్చుకున్నావురా" అన్నాడు.

"నాపేరే అది" అన్నాను.

"దాస్తున్నావురా" అన్నాడు ఏదో నేరం కనుక్కున్నట్టు రెండోమిత్రుడు.

"నాపేరే అది" అన్నాను.

"నీవుదాస్తే దాగుతుందిటరా. రెండు రోజుల్లో నీగుట్టు రట్టుచేస్తాము" అని వెళ్ళిపోయారు ఉక్రోషంగా యిద్దరూ.

మధ్యాహ్నం స్కూలుకు వెళ్ళగానే యిద్దరు మిత్రులు "ఏరా! నీ ప్రేమ వ్యవహారం నిరాటంకంగాసాగుతోందా" అన్నారు.

"ప్రేమ! ఇంకా దాల్లోకి అడుగు పెట్టలేదే!" అన్నాను.

"అంతేలే. నీకేంతెలుస్తుంది. పేరులో ప్రేయసిపేరుకూడా యిరికించుకోవటం తప్ప" అన్నారు.

"ఇదేమిట్రా యిలా వాగుతున్నారు" అన్నాను.

"ఇదుగో నీపుస్తకంమీద నీ చేతితో వ్రాసినపేరే చూసుకో" అన్నారు నా కాంపోసిషన్ పుస్తకం చేతికియిచ్చి.

"ఏమిటో వింత" అన్నాను.

"నీపేరు చదువు" అన్నారు.

"ముక్తేవి వెంకట విజయ వీరరాఘవరావు" అని చదివాను.

"అదుగో ఆ విజయే" అన్నారు.

"ఔను విజయ. ఏమిటి ప్రత్యేకత."

"నీ లవ్ పేరే అది అయుండాలి. దానిపేరే యిరికించుకుని ఉన్నావు పేరులో."

"ఓస్. ఇదా మీ రహస్య పరిశోధన. మరి వెంకట ఎవరిదంటారు"అన్నాను.

"విజయ మాత్రమే ఆడపేరులాగా వుంది" అన్నారు.

"మీయిష్టం వచ్చినట్లు కల్పించుకోండి. నాపేరుమాత్రం అదే"అన్నాను.

"ఒరేయ్, నువ్వు చెప్పకపోయినా రేపటికి నువ్వు ప్రేమించిన అమ్మాయి పేరు, ఇల్లు అన్నీ చెబుతాము" అన్నారు నా మిత్రులు మరియిద్దర్ని కలుపుకుని.

ఇహ వాళ్ళ నలుగుర్నీ డిటెక్టివు నెం. 1, 2, 3, 4 అందాం.

వాళ్ళలో మొదటియిద్దరూ నన్ను రహస్యంగా వెంటాడి జాడ లాగేందుకుట. మిగతా యిద్దరూ బయట ఆ చోకీ తీశేందుకుట.

ఏమీలేనిదానిమీద యింత పెద్ద ఎత్తున కల్పించుకొస్తున్నారంటే నాకు వింతగా తోచింది. కానీ మా క్లాసు వారికి మాత్రం స్పెషల్ యింట్రెష్టు టాపిక్ అయింది.

రెండవరోజున డిటెక్టివులచుట్టూ నా సహాధ్యాయులు పోగయారు. సంగతి ఏమిటి తేలిందని ప్రశ్నించారు.

"వీడు ప్రేమించిన అమ్మాయిపేరు విజయలక్ష్మి" అన్నాడు డిటెక్టివు 1.

"ఆ అమ్మాయి మన కాలేజీలోనే చదువుతూన్నది" అన్నాడు డిటెక్టివు 2.

"ఏ క్లాసు?" అని ఆత్రంగా అడిగారు నా సహాధ్యాయులు.

"మధ్యాహ్నం చెబుతాము"అన్నారు డిటెక్టివులు.

మధ్యాహ్నం 2 గంటలు అయింది. డిటెక్టివులచుట్టూ మనుష్యులు పోగయారు.

"ఏక్లాసో తేలిందా?" అన్నారు నా సహాధ్యాయులు,

"ఈ కాలేజీ రిజిస్టర్లు తిరగేశాము. ఈపేరు ఎక్కడా కన్పించలేదు"అన్నారు డిటెక్టివు 1, 2.

"ఆ అమ్మాయి హైస్కూలుది అయ్యుండాలి'అన్నారు డిటెక్టివు 3, 4.

"ఒక హైస్కూలమ్మాయి యింటి వంక పరీక్షగాచూస్తూ వెడుతాడు వీడు. సంగతి రేపుచెబుతాముతేల్చి" అన్నారు డిటెక్టివులంతా ఏకగ్రీవంగా.

* * *

రాత్రి 8 గం॥ అయింది. డిటెక్టివులు నలుగురూ మాయింటికి వచ్చారు.

"ఏరా! నామీద మీ రహస్య పరిశోధన పూర్తయిందా?" అన్నాను నేను.

"అది పూర్తయినట్టేగాని, నీ నోటి వెంబడే విందాము" అని అన్నాడు డిటెక్టివు 1.

"అసలు సంగతి చెప్పెయ్యరా ప్రాణంతియ్యక" అన్నాడు డిటెక్టివు 2.

"ఏమిట్రా చెప్పేది. నాపేరే అంత" అన్నాను.

"చెప్పకపోతే నీవు విజయలక్ష్మిఅనే అమ్మాయిని ప్రేమించావని టాంటాం చేస్తాను" అన్నాడు డిటెక్టివు 3.

"దానివల్ల నాకు నష్టం" అన్నాను.

"అంతేగాదు గోడలమీద రాస్తాం" అన్నాడు డిటెక్టివు 4.

"మీయిష్టం" అన్నాను మొండిగా.

"దేనికొచ్చిన పేచీసంగతి చెప్పరా మా ప్రాణాలుతియ్యక" అన్నారు అందరూ ఇహ సామంగా ప్రయత్నిద్దామని.

"మీరు ఓ డి న ట్టు ఒప్పుకోండి" అన్నాను.

"ఓడిపోయా"మన్నారు డిటెక్టివులు.

"మీరుచేసేదేముంది గాని మనవాళ్ల ప్రవర్తనే అంతరా. ప్రతిదానికి ఊరికే అనుమానపడడం, దాన్నిగురించి పరిశోధనకి బయల్దేరటం. సంగతి అంతు చిక్కకపోతే అల్లరిచేయటం ఉన్నవి లేనివి కల్పించి చివరకి కసి తీరక గోడలు కరాబుచేయడం" అన్నాను.

"ఉపన్యాసం ఆపి అసలు సంగతి చెప్పరా"అన్నారు డిటెక్టివులు నల్గురూ.

"ఈ ఫోటో చూడండి" అని మా తాతఫోటో యిచ్చాను.

"మీ తాతయ్యాదా. ఈయన పేరు" అన్నారు డిటెక్టివులు.

"అది తెలిస్తే మీబుఱ్ఱ బూజు వదులుతుంది. క్రింద వ్రాసివున్న పేరు చదవండి" అన్నాను.

"ముక్తేవి వెంకట విజయరాఘవయ్య" అని చదివారు.

"చంపావురా. ఇది మీ తాతయ్యపేరా. మొదట్నుంచీ యిలా వ్రాసుకోక మధ్యలో మొదలుపెట్టావేమిరా" అన్నారు.

"మరి మీలాటి రకాలికి పని తగిలేదెలా. డిటెక్టివులుకి విశ్రాంతి ఉంటే వాళ్ళే నేరస్తులవుతారుటగా" అన్నాను.

ఇదీ మా డిటెక్టివుల కథ.

# * బాలవినోదము *

రచన: "మరువాడ"

*

అక్క: స్త్రీలింగము. దీనికి పుల్లింగము అన్న ఆప్తబంధువు. బాల్యమందే పతివియోగము కలిగినచో ఈమె పుట్టిల్లు చేరుకుని 'పరోపకారార్థ మిదం శరీరమ్' అనునట్లు తలిదండ్రులకు సోదరులకు సేవ చేయు కష్టజీవి.

ఉక్క: మండువేసవి, కిటికీలులేని గది గాలి బంధించిన సమయము లేదా పట్నంలో సినీమాహాలు మధ్యాహ్నం 3 గంటలు వేళ మేట్నీషో వాయుప్రసర్ణ లేక తలుపులన్నియు మూసి చీకటికోళంచేయు స్థలం. ఈ సమయములలో మానవులు అనుభవించే బాధ.

కుక్క: పెంపుడు జంతువు. చోరభయము లేకుండా ఇంటిని రాత్రివేళ ఘూర్కావలె కాపలాకాయు విశ్వాసము గల జంతువు. దొరసాని వొళ్ళో కూర్చుని కారులో ప్రయాణంచేస్తూ ముద్దులుగునిసే ఒక సుఖజీవి. నీచగుణం మానలేదు. అందుచే మనవారు నీచుల దూషించునపుడు "వాడిది కుక్కబుద్ధిరా" అంటారు.

చుక్క; నక్షత్రము. రాత్రి గోచరించును. పగలు అగోచరము. చల్లని చంద్రుడు నీలి ఆకాశము పున్నమరేయి. ఈవేళలో చుక్కలు దూరిన ఆనందమయమే!

డెక్క: పశువులకు గుఱ్ఱములకు కాలిచివర యుండును. ఆయా జంతువులకు బురదలోను, రోడ్లమీద నడచుటకు చాల ఉపయోగపడును.

నక్క: టక్కరిజంతువు. ప్రయాణములలో మార్గమధ్యమున ఇది ఎదురైతే శుభశకునం అంటారు. దీనినిగూర్చి పిల్లలకథలు చాల గలవు. ఎవరైనా చాతగాని పరుగులు పరుగెత్తితే 'పులినిచూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు' అను సామెత పలికెదరు. 'నక్క యెక్కడ నాగలోకం ఎక్కడ' సామెత కూడ గలదు.

పిక్క: చింతకాయను లోపల జీడికాయకు పైన యిది వుండును.

మొక్క: ఎంత మహావృక్షమునకైనను చిన్నదిగా యున్నపుడు అనగా విత్తనం మొలకెత్తగానే యీ పేరుతో పిలచెదరు. పిల్లలు పెద్దలమాటకు యెదురుచెప్పిన "మొక్క నాడు వంగనపుడు మ్రానై వంగునా?" అని నిందించెదరు.

పూర్వకాలం: శ్రావణమాసం మంగళగౌరి వ్రతం. కన్య-పిల్ల మొక్కపెసలు ముత్తయిదుకు వాయనం. ముద్దు ముచ్చటగా యుండేది.

లక్క: ఇది నగలుచేయు విశ్వబ్రాహ్మణునకు మిక్కిలి ఉపయోగపడు వస్తువు.

రెక్క: పక్షులు సంచరించుటకు ఇది ముఖ్యావసరం. నిరాధారులైనవారి జీవితం రెక్కలులేని పక్షితో సరిపోల్చెదురు. ఎవరైనా మితిమీరి సంచరిస్తే "చదవురుగుకు రెక్కలొచ్చినట్లు" అంటారు.

మనుష్యులందు-అక్క-ప్రేమమయురాలు
జంతువులందు-కుక్క-విశ్వాసముగలది

కంసాలికి-లక్క-చాల ఉపయోగకరము
పక్షులకు-రెక్క-అత్యావసరము

ఆకాశమందు-చుక్క-అందమిచ్చును
భూమిపైని-మొక్క-వినోదమిచ్చును

అడవులందు-నక్క-స్వేచ్ఛాజీవి
పొలముదున్ను-ఎక్క-కష్టజీవి.

"అమ్మ అక్కడ, అయ్య ఇక్కడ. ఇద్దరికి పొత్తు ఎక్కడ?" ఇది ఏ సినిమాలో ఎక్కడ సందర్భమో పోల్చుకోండి......